క్లుప్తంగా

సాయికుమార్‌కు పతకాలు



సాయికుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాజానగరం: గైట్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న ఎ.సాయికుమార్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు, వెండి పతకాలను సాధించాడని ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ తెలిపారు. అమలాపురంలో తోరం రమేష్ స్మారకం సందర్భంగా పురుషులు, మహిళల విభాగాలలో హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించాయన్నారు.

కొంకుదురులో అన్నసమారాధన



కొంకుదురులో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో ఉన్న శ్రీకనకదుర్గమ్మ తల్లి ఆలయం వద్ద శుక్రవారం ఘనంగా అన్న సమారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతలు సప్పా సత్యనారాయణ, శాంతి దంపతులు సమకూర్చిన ఈ అన్న సమారాధనలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదానం



వీరభద్రునిగడ్డలో అన్నదానం

గోకవరం: దేవీ శరన్నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని వీరభద్రునిగడ్డలో శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో అన్నదానం చేశారు. ఈ అన్నదానానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రూ.1.10 లక్షల విరాళం అందించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు ఐదు వేల మంది పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లారీ, కారు ఢీ



ఘటనా స్థలంలో కారు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లో శుక్రవారం లారీ, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులోని ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరంలోని కొత్తపేటకు చెందిన రాజు, కుటుంబ సభ్యులతో కలిసి కారులో గోకవరం వైపు నుంచి ఇంటికి వెళుతున్నారు. బూరుగుపూడి జంక్షన్‌లో ఎదురుగా గ్యాస్ బండల లోడు లారీ, ఈ కారు ఢీకొన్నాయి. కారులోని ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి.

విద్యార్థుల సామర్థ్యాల అంచనాకు సీస్ పరీక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్ మెంట్ సర్వే (సీస్) పేరుతో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు నవంబర్ మూడో తేదీన ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తున్నట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలను వివరించారు. సీస్ పరీక్షను 3, 6, 9 తరగతుల విద్యార్థులకు గణితం, తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహిస్తామన్నారు. డిగ్రీ, డీఎడ్, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పేరుతో వినియోగించడం జరుగుతుందన్నారు. ఏదైనా పాఠశాలలో నవంబర్ 3న తేదీన జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతున్నట్లైతే ముందుగా తమకు తెలియచేయాలని, తదనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో అర్బన్ ఎంఈఓ 2 రమా రజని, సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బిసెట్టి ప్రసాద్, కుమారి, నీలిమ, నాగలక్ష్మి, కోటేశ్వరి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఇక సురక్షితమే..

- శరవేగంగా జలజీవన్ మిషన్
- అనపర్తి నియోజకవర్గంలో రూ.42.64 కోట్లతో పనులు
- ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు
- వాటర్ ట్యాంకులు, పైపులైన్ల ఆధునికీకరణ

మండలం	పనులు	నిధులు
పెదపూడి	25	రూ.15 కోట్లు
అనపర్తి	16	రూ.8.78 కోట్లు
బిక్కవోలు	18	రూ.8.76 కోట్లు
రంగంపేట	35	రూ.10.10 కోట్లు

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికీ స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల పనులు వేగవంతంగా పూర్తి చేస్తోంది. అనపర్తి నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ.42.64 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో దాదాపు 94 పనులు చేపట్టారు.ఈ నిధులతో పైపులైన్లు ఏర్పాటుతోపాటు నాలుగు మండలాల పరిధిలో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలు జరుగుతున్నాయి. పెదపూడి మండలంలో 18 గ్రామాల పరిధిలో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో పైపులైన్ల ఏర్పాటు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

తాగునీటి సమస్యకు పరిష్కారం


గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు సురక్షిత తాగునీరు అందించేలా ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పనులు పెదపూడి మండలంలో రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు, దోమాడ, కైకవోలు, శహపురం, కాండ్రేగుల, సంపర, చింతపల్లి, కుమారప్రియం, పుట్టకొండ, వేంద్ర, పైన, రాజుపాలెం, జి.మామిడాడ, గండ్రేడు, పెద్దాడ గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామాల్లోని నివాసాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లకు రక్షిత తాగునీరు అందించే దిశగా ఈ మిషన్ పనిచేస్తోంది. పథకం నిర్వహణ, ప్రణాళికపై ఇప్పటికే ఆయా గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. పైపులైన్లు, కుళాయి కనెక్షన్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులను అధికారులు దశలవారీగా పూర్తి చేస్తున్నారు.

నెల రోజుల్లో పనులు పూర్తి

జలజీవన్ మిషన్ కింద ఇప్పటివరకూ పెదపూడి మండలంలోని 17 గ్రామాల్లో రూ.15 కోట్ల నిధులతో 25 పనులు చేపట్టారు. ఇవి 80 శాతం మేర పూర్తయ్యాయి. 15 గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. వేంద్రలో సంపు నిర్మిస్తుండగా, మిగిలిన 16 గ్రామాల్లో పైపులైన్లను ఆధునీకరించారు. కాండ్రేగులు, జి.మామిడాడ, పుట్టకొండ, చింతపల్లి, రామేశ్వరం, దోమాడ, గండ్రేడు, కుమారప్రియం గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు పూర్తి చేశారు. మిగిలిన గ్రామాల్లో పూర్తి చేయాల్సి ఉంది. గ్రామాల్లో తాగునీటి సరఫరా, నిర్వహణ చేయడానికి పది మందితో ఓ విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీని ఏర్పాటు చేస్తారు. ఇందులో సర్పంచ్ చైర్మన్‌గా, సచివాలయ కార్యదర్శి కన్వీనర్‌గా, మరో 8 మంది సభ్యులుగా ఉంటారు. ఈ జలజీవన్ మిషన్‌లో 50 శాతం కేంద్ర, 40 శాతం రాష్ట్రప్రభుత్వ, 10 శాతం స్థానిక పంచాయతీ నిధులు ఉంటాయి. పంచాయతీలు చెల్లించాల్సిన 10 శాతం వాటాను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. మరో నెల రోజుల్లో ఈ పనులు పూర్తి చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు.



రామేశ్వరంలో ఓ ఇంటికి వేసిన కుళాయిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ గంగాధర్



శహపురంలో జలజీవన్ మిషన్‌లో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్

త్వరలో స్వచ్ఛమైన నీరు



మండలంలో నెల రోజుల్లో పనులు పూర్తి చేసి, వాటర్ ట్యాంకులు వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తున్నాం. ఈ పనులు ప్రజల పర్యవేక్షణలో పారదర్శకంగా, నిబంధనల ప్రకారం చేపడుతున్నాం. త్వరలో మండలంలో ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నాం. సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి.

– గంగాధర్, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పెదపూడి మండలం

ప్రత్యేక ఓటరు నమోదును వినియోగించుకోవాలి

రాజానగరం: భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ ఉంటుందని తహసీల్దార్ పవన్ కుమార్ తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల ముసాయిదా జాబితాను 216 పోలింగ్ కేంద్రాల వద్ద శుక్రవారం ప్రదర్శన చేశారు. ఈ జాబితాలో ఇంకా చేర్పులు, మార్పులు ఉంటే నిబంధనలను అనుసరించి తెలియజేయాలన్నారు. కొత్తగా ఓటు హక్కు కోసం వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను డిసెంబరు 26లోగా పరిష్కరిస్తారన్నారు. తుది ఓటర్ల జాబితా 2024 జనవరి 5న ప్రచురిస్తారన్నారు. 2024 జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందవచ్చు. ఇందుకుగాను ఫారమ్ -6లో దరఖాస్తు చేసుకోవాలి. మరణించిన/వలస వెళ్లిన ఆయా ఓటరు పేరును శాశ్వతంగా తొలగించేందుకు వారి కుటుంబ సభ్యుల ధ్రువీకరణతో ఫారమ్ -7లో దరఖాస్తు చేయాలి. అలాగే పేరు, చిరునామా, లింగం, ఫొటో, తదితర సవరణలకు, నియోజకవర్గ పరిధిలో ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరొక పోలింగ్ కేంద్రానికి ఓటు బదిలీకి, నకలు ఓటు కార్డుకు, దివ్యాంగ ఓటరు గుర్తింపుకు ఫారమ్ -8లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం నియోజకవర్గంలో 216 పోలింగ్ బూత్‌లు ఉండగా, 2,08,058 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,03,017 మంది స్త్రీలు, 1,05,032 మంది పురుషులు, తొమ్మిది మందిని థర్డ్ జండర్ ఉన్నారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: చిత్తూరు జిల్లా నగరిలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగిన ఎనిమిదో ఏపీ అంతర్ జిల్లాల జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయ జట్టులో స్థానం సాధించిన ఇద్దరు క్రీడాకారులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందించారు. ఈ పోటీల్లో జూనియర్స్ విభాగంలో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి, జాతీయ జట్టుకు ఎంపికైన ఎస్.రాకేష్, బి.స్వామి ఎమ్మెల్యేను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో వీరు మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకటసుబ్బారెడ్డి, శ్రీలక్ష్మీ గణపతి ఆలయ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ బిక్కవోలు మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి క్రీడాకారులను అభినందించిన వారిలో ఉన్నారు.

పీఎంపీ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



రాయవరం పీఎంపీ కన్వీనర్‌గా ఎంపికైన వెంకటరమణ, కోకన్వీనర్లు జగదీష్, శివ

రాయవరం: రాయవరం, అనపర్తి, బిక్కవోలు మండలాల పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం రాయవరంలో నిర్వహించారు. స్థానిక వెలమ కమ్యూనిటీ భవనం ఆవరణలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ గంగుమళ్ల రాంబాబు, జిల్లా కోకన్వీనర్ బళ్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగాయి. రాయవరం మండలం నూతన కమిటీ కన్వీనర్‌గా నాదు వెంకటరమణ, కోకన్వీనర్లుగా చింతా జగదీష్, ఎస్.శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనపర్తి, బిక్కవోలు మండల కన్వీనర్‌గా వాసంశెట్టి నాగేశ్వరరావు, కోకన్వీనర్లుగా డి.సాయి రామారెడ్డి, నీలంశెట్టి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథి కాకినాడకు చెందిన మెడికవర్ హాస్పిటల్ వైద్య నిపుణుడు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో పీఎంపీలు రోగులకు అందించే వైద్య సేవలు ఎంతో అమూల్యమైనవన్నారు. పీఎంపీ నేతలు కేవీ వెంకటరెడ్డి, పరంశెట్టి శ్రీనివాస్, కేవీజీకేరెడ్డి, రాయవరం, అనపర్తి, బిక్కవోలు మండలాల పీఎంపీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దేవీచౌక్ వార్షికోత్సవం



విప్పపువ్వులతో తయారు చేసిన చీర, కిరీటంతో జగన్మాతకు అలంకరణ



బోనాలతో దేవీచౌక్‌కు వచ్చిన మహిళలు

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధం దేవీ చౌక్ 31వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం తీర్థం జరిగింది. గ్రామానికి చెందిన నిడదవోలు కనకాచారి, కుటుంబ సభ్యులు విప్పపువ్వులతో తయారు చేసిన చీర, కిరీటాలను జగన్మాతకు అలంకరించారు. అలాగే గ్రామానికి చెందిన ఆడపడచులు బోనాలు సమర్పించారు. సాయంత్రం హాస్యనటులు పవన్ కుమార్, హరిత, భద్ర సందడి చేశారు.

కొత్త తరహా కథతో నరకాసుర



మాట్లాడుతున్న నరకాసుర హీరో రక్షిత్, చిత్రంలో హీరోయిన్లు అపర్ణ, సంకీర్తన, దర్శకుడు సెబాస్టియన్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రొటీన్ కథలకు భిన్నంగా కొత్త తరహా కథతో నరకాసుర చిత్రాన్ని తెరకెక్కించామని హీరో (పలాస ఫేమ్) రక్షిత్ అట్లూరి అన్నారు. ఆ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. హీరో రక్షిత్ మాట్లాడుతూ కుటుంబంతో కలిసి తిలకించే విధంగా నరకాసుర చిత్రం ఉంటుందన్నారు. పలాస ఘన విజయం సాధించిన తర్వాత కూడా తదుపరి చిత్రానికి ఎక్కువ గ్యాప్ రావడానికి కారణంగా నరకాసుర చేయడం వల్లే అన్నారు. మరో రెండు చిత్రాలు పూర్తవుతున్నాయని, రెండు, మూడు నెలల వ్యవధిలో అవి కూడా విడుదల కానున్నాయన్నారు. నవంబర్ మూడున నరకాసుర విడుదల అవుతుందని, ఐదు భాషల్లో చిత్రాన్ని తెరకెక్కించడం జరిగిందన్నారు. దర్శకుడు సెబాస్టియన్ మాట్లాడుతూ తాను యానిమల్ ప్లానెట్‌లో ఏడాదిన్నర పనిచేశానన్నారు. ఆ అనుభవంతోనే సినిమాను ఎంతో అందంగా తీయగలిగానన్నారు. కొత్త విజువల్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా నరకాసుర చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. కార్యక్రమంలో హీరోయిన్లు సంకీర్తన, అపర్ణలు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి సీపీఎం బస్సుయాత్ర

ప్రకాశం నగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవలంబిస్తున్న నిరంకుశ విధానాలను ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం తేవడమే లక్ష్యంగా సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి బస్సు యాత్ర ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఒక యాత్ర, శ్రీకాకుళం జిల్లా మందస నుంచి రెండో యాత్ర, రాయలసీమలోని కర్నూలు నుంచి మూడో బస్సుయాత్ర ప్రారంభమవుతుందన్నారు. నవంబర్ 6వ తేదీన బస్సుయాత్ర రాజమహేంద్రవరం చేరుతున్న సందర్భంగా ప్రజా రక్షణ భేరి పేరుతో సభ నిర్వహిస్తామన్నారు. ముగింపు సందర్భంగా విజయవాడలో నవంబర్ 15వ తేదీన భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఆ సభకు పార్టీ జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బి.రాఘవులు తదితర నాయకులు హాజరవుతున్నారన్నారు.

సురక్షతో ప్రజారోగ్యానికి రక్షణ

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్త వీరపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పలువురికి వైద్య సేవలందించారు. ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం 108, 104, ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. అదే బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రతిఒక్కరికీ ఖరీదైన వైద్యాన్ని గ్రామాల్లోనే ఉచితంగా అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, సర్పంచ్ మత్స పద్మశ్రీ, సచివాలయ కన్వీనర్ పెంటపాటి వీర వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు వీరభద్రరావు, లంక శేషారావు, కంద రాజు, కంకట వెంకన్న, కందమణి, లంక మణి, ఈలకొలను సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొత్త వీరపాలెంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ప్రజారోగ్య పరిరక్షణకు సురక్ష దోహదం : ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి గ్రామస్తులు విశేష సంఖ్యలో హాజరై వైద్యసేవలు పొందారు. వీరికి మెడికల్ కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెంలో ప్రజలకు మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ప్రజల చెంతకే వైద్య సేవలు

బిక్కవోలు: వైద్య సేవలను ప్రజల చెంతకే తీసుకెళ్లిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని సర్పంచ్ సత్య సాయిరాం అన్నారు. శుక్రవారం మెళ్లూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 505 మంది రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమ్మన ఆనంద్, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ జి.విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు ఎల్ గణేష్, సూరిబాబు, మురళీధర్ పాల్గొన్నారు.



మెళ్లూరులో సేవలందిస్తున్న వైద్యులు

508 మందికి వైద్యపరీక్షలు

మధురపూడి: కోరుకొండ మండలం రాఘవపురంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగిన ఈ కార్యక్రమంలో 508 మందికి వైద్యపరీక్షలు చేశారు. శిబిరాన్ని తహసీల్దార్ పాపారావు ప్రారంభించగా, కోటికేశవరం పీహెచ్‌సీ వైద్యులు పుణ్యశాంతి తదితరులు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఈఓఆర్డీ మహేశ్వర ప్రతాప్, రాఘవపురం సచివాలయం సెక్రటరీలు కె.రుద్రశేఖర్, ఏ.కుమారి పాల్గొన్నారు.

ఉపాధి గ్రామసభ

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ ఆర్‌బీకేలో ఉపాధి పనుల గుర్తింపు, ప్రణాళిక రచన సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీఓ భ్రమరాంబ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు నిరంతరాయంగా జరుగుతాయన్నారు. 2024–25 సంవత్సరానికి గాను అంచనాలు తయారు చేశారు. దీనిలో భాగంగా 80 పనుల నిర్వహణ కోసం రూ.1.50 కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో సచివాలయం సెక్రటరీలు, టెక్నికల్ అసిస్టెంట్, గ్రామస్తులు, రైతులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. కాగా.. పశ్చిమగానుగూడెం, గరగలంపాలెం గ్రామాల్లో శనివారం సమావేశాలు నిర్వహించనున్నారు.

ఘనంగా సత్యసాయిబాబా రథయాత్ర



రథయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పెదపూడి: భగవాన్ సత్యసాయిబాబా ఆశయ సాధనకు, హైందవ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని శ్రీసత్యసాయిబాబా సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజు అన్నారు. కరకుదురు, దోమాడ, పెదపూడి, పెద్దాడ, సంపర, ఏపీత్రయం గ్రామాల్లో శుక్రవారం సత్యసాయిబాబా రథయాత్ర ఘనంగా నిర్వహించారు. రథయాత్రకు ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. భజనలు, సంకీర్తనలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా గోవిందరాజు మాట్లాడుతూ ఈ రథయాత్ర మండలంలోని మిగిలిన గ్రామాల్లో కొనసాగుతోందని చెప్పారు. సమితి ప్రతినిధులు మార్ని శ్రీరాములు, మార్ని సత్యనారాయణ, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



పాఠశాలకు కంప్యూటర్ పరికరాలు అందిస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: ప్రతిఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రథమ్ సంస్థ నిర్వహిస్తున్న కంప్యూటర్ ల్యాబ్‌కు గ్రామానికి చెందిన సబ్బెళ్ల సురేష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి సేవా సంస్థ సమకూర్చిన రూ.8 వేల విలువైన కంప్యూటర్ కీబోర్డ్, మౌస్ తదితర పరికరాలను కృష్ణారెడ్డి చేతులమీదగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవలందించడంలో స్వచ్ఛంద సంస్థలు కీలకపాత్ర పోషించాలన్నారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి సేవా సంస్థలు చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి పీవీ కృష్ణారెడ్డి, ట్రస్ట్ సభ్యులు నల్లమిల్లి శివసాయినాథ్‌రెడ్డి, మల్లిడి శివారెడ్డి, గుడిమెట్ల శివశంకర్‌రెడ్డి, కర్రి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో ముసాయిదా ఓటర్ల జాబితా

అనపర్తి: ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు నియోజకవర్గ పరిధిలోని 228 పోలింగ్ స్టేషన్లలో ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లందరూ జాబితాను సరిచూసుకోవాలని, అర్హత ఉండి, ఓటర్ల జాబితాలో నమోదు కానివారు బూత్ లెవెల్ అధికారిని సంప్రదించవచ్చని చెప్పారు. కొత్తగా ఓటు నమోదుకు ఫారం–6, ఓటు తొలగింపునకు ఫారం–7, ఓటు సవరణ, ట్రాన్స్‌ఫర్‌కు ఫారం–8 అందించాలని సూచించారు.

మహిళా కారాగారం సందర్శన



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: రాజమహేంద్రవరం మహిళా కేంద్ర కారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ) చైర్మన్, న్యాయమూర్తి కె.ప్రత్యూష కుమారి శుక్రవారం సందర్శించారు. కారాగారంలో వసతులు, సదుపాయాలను పరిశీలించి అక్కడున్న మహిళా ఖైదీలతో మాట్లాడారు. వారికి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయ సంబంధమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా పారా లీగల్ వలంటీర్ ద్వారా జిల్లా న్యాయసేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. ప్రత్యేకంగా ముద్దాయిలకు, ఖైదీలకు న్యాయ సేవలందించేందుకు పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ సిస్టమ్ గురించి వివరించారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా ఫ్రీడం రన్

కంబాలచెరువు: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌కేఆర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ఫిట్ ఇండియా స్వచ్ఛత ఫ్రీడం రన్ 4.0 నిర్వహించారు. కళాశాల నుంచి కంబాల చెరువు వద్ద దండి మార్చ్ విగ్రహాల వరకూ ఈ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ రాఘవ కుమారి మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మంచి సమాజ నిర్మాణం జరుగుతుందని, దానికోసం ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు.